క్లుప్తంగా

బొల్లవరంలో ప్రత్యేక పూజలు



నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బొల్లవరం గ్రామం సమీపంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మే నెల చివరి శనివారం సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. మండలంలోని గ్రామాల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ అశోకవర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు: డీలర్లు నకిలీ విత్తనాలు, మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ అశోకవర్ధన్‌రెడ్డి, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని పలు ఫర్టిలైజర్, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు కొన్న విత్తనాలకు కచ్చితంగా రశీదు పొందాలన్నారు. లైసెన్సు కంపెనీ విత్తనాలను మాత్రమే డీలర్లు అమ్మాలని, ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విత్తనాలను అమ్మితే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తనాలను నాటిన తర్వాత విత్తన ప్యాకెట్లను తమ వద్దే ఉంచుకోవాలన్నారు. అలాగే బిలుల్లు లేకుండా తక్కువ ధరకు ఇస్తానంటే తీసుకోవద్దని సూచించారు. తగిన ధ్రువపత్రాలు లేని రూ.3,09,312 విలువ గల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏడీఏ తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: ఈనెల 27న మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

చదువును మించిన సంపద లేదు



పిల్లలకు నీతి కథ చెబుతున్న లైబ్రేరియన్ మద్దమ్మ

పగిద్యాల: చదువును మించిన సంపద లేదని.. కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని లైబ్రేరియన్ మద్దమ్మ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్, ఆర్థికల్స్‌ను సీనియర్ టీచర్ మల్లేశ్వరరావు బోధించారు. బాల్యం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పిల్లికి పెత్తనం కథలోని నీతిని పిల్లలకు వివరించారు.


250 పశువులకు టీకాలు



ఎద్దులకు గొంతువాపు టీకా వేస్తున్న వైద్యాధికారి భాస్కర్

పాములపాడు: మండల పరిధిలోని వేంపెంట గ్రామంలో శనివారం 250 పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి భాస్కర్ తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులు 48 గంటల్లో మృత్యువాతకు గురవుతాయని, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణాంతకమైన గొంతువాపు(గురక) వ్యాధి నిర్మూలనకు ఇంటింటికి తిరిగి టీకాలు వేస్తున్నామని చెప్పారు. దీనిని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రసన్న, చాందిని, కరిముల్లా, గోపాలమిత్ర భాస్కర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ భూముల వేలం



వేలంపాట నిర్వహిస్తున్న ఈఓ వెంకటరమణ

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం ఈఓ వెంకటరమణ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి, రామేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన దేవాలయ మాన్యం భూముల కౌలుకు వేలం పాట నిర్వహించారు. శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి మాన్యం 115 ఎకరాలు రూ.9.34 లక్షలు, రామేశ్వర స్వామి 51 ఎకరాల భూమికి రూ.2.81 లక్షలు కౌలు వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామక్రిష్టారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ ఫీజు.. గుండె గుబేలు!

- విద్యాసంవత్సరం ప్రారంభంకాక ముందే ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్లు
- నానా రకాల ఫీజు పేరుతో దందా
- అదే పాఠశాలలో యూనిఫాం, పుస్తకాల విక్రయం
- ఆర్థికంగా చితికిపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ఆత్మకూరు: ఏడాదికేడాది కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల ఫీజు పెంచుతూ తల్లిదండ్రులను ఆర్థికంగా చిదిమేస్తున్నాయి. ఆత్మకూరు పట్టణంలో గతంలో ఎన్నడూలేని విధంగా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు నానా రకాల ఫీజును వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అంతేకాకుండా విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అక్రమ అడ్మిషన్లకు తెరలేపాయి. తమ పాఠశాలలకు వస్తే విద్యార్థులకు ర్యాంకుల పంట పండుతుందని, ఇంకా ఏవేవో మాయమాటలు చెబుతూ తల్లిదండ్రులను ఆకర్షిస్తూ దందాను కొనసాగిస్తున్నాయి.

భగ్గుమంటున్న ఫీజు

ఆత్మకూరు పట్టణంలో మూడేళ్ల క్రితం వెలిసిన ఓ కార్పొరేట్ స్కూల్, రెండు దశాబ్దాల క్రితం వెలిసిన పేరుమోసిన పాఠశాలలు ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో అడ్మిషన్ల పేరుతో వసూలు చేస్తున్న ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రుల్లో దడ పుట్టిస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలలో నర్సరీ విద్యార్థులకు రూ.20 వేలు, 1 నుంచి 8వ తరగతి వరకు రూ.35 వేలు, 9వ తరగతికి రూ.42 వేలు, 10వ తరగతికి అదే స్థాయిలో ఫీజుల దందాకు తెరలేపాయి. భారీ స్థాయిలో ఫీజులు పెంచడంతో తల్లిదండ్రులు ఇదెక్కడి చదువులురా బాబూ అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లోనే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు..

ఆయా పాఠశాలల్లో విద్యార్థులు యాజమాన్యం విక్రయించే పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయి. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.42 వేలు ఫీజు వసూలు చేస్తుండగా అదనంగా యూనిఫాం, పుస్తకాలకు రూ.10 వేలు చొప్పున చెల్లించాల్సి వస్తోంది. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పాఠ్య పుస్తకాలను కూడా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా 9వ తరగతి చదివించాల్సిన పిల్లలకు ఈ కార్పొరేట్ పాఠశాలల్లో ఏడాదికి రూ.52 వేలు ఎలా చెల్లించాలంటూ తల్లిదండ్రులు మదన పడుతున్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో ప్రజలు అత్యధికంగా వ్యవసాయభూములు, దినసరి కూలీకి వెళ్లే కుటుంబాలే అధికంగా ఉన్నాయి. వ్యవసాయంపై ఆధారపడిన, మధ్యతరగతి ప్రజలు విద్యార్థులను ఈ పాఠశాలల్లో చేర్పించాలంటే వెనుకాడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఇప్పుడిప్పుడే మెరుగు పడుతున్నా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులు నర్సరీ నుంచి చదివుతుండటంతో స్కూలు మార్చలేని పరిస్థితిలో ఉన్నారు.

బస్సు ఫీజు పేరుతో కొత్త దందా...

పాఠశాలల్లో ఆత్మకూరు నుంచి కేవలం పట్టుమని 10 కి.మీ. దూరం లేని చిన్న పల్లెటూర్లు, సమీపంలోని పాములపాడు, కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే విద్యార్థులకు బస్సుల ఫీజు పేరుతో కొత్త దందాను తెరలేపాయి. ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.9 వేల నుంచి రూ.14 వేలు చొప్పున బస్సు చార్జీలను అధికంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు 9వ తరగతి చదివే విద్యార్థి కార్పొరేట్ స్కూల్‌లో చేరాలంటే అడ్మిషన్ ఫీజు రూ.42 వేలు, పుస్తకాలు, యూనిఫాంకు రూ.10 వేలు, బస్సు ఫీజు మరో రూ.14 వేలు మొత్తం రూ.66 వేలు ఏడాదికి చెల్లించాల్సిన పరిస్థితి ఉంది.

పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ఏడాదికేడాది ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు పెరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఫీజుల నియంత్రణ గురించి పట్టించుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు తమకు మామూళ్లు ముడితే చాలు ఎంత ఫీజులు పెంచుకున్నా ఓకే అన్న చందంగా తయారయ్యారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఫీజులు తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

> **ఫీజు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటాం**
>
> ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు వేసవి సెలవులు ముగిసేవరకు కొత్త అడ్మిషన్లు స్వీకరించరాదు. అలాగే ఫీజు విషయంలో కూడా ఎలాంటి పెంపు ఉండరాదన్నారు. అడ్మిషన్ల ఫీజు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను వేధించడం సరికాదు. నూతన అడ్మిషన్లు చేపట్టి ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ఫీజు పెంచినట్లు తల్లిదండ్రులు తనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే సంబంధిత పాఠశాలల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> – ఆత్మకూరు ఎంఈఓ జానకీరామ్

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



కలశాలను తీసుకెళ్తున్న భక్తులు

వెలుగోడు: మండలకేంద్రంలోని అయపురెడ్డి నగర్‌లో వెలసిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం సుదర్శన మహా మత్స్యం జయ హోమం, మహాబలి పూర్ణాహుతి, 108 కేజీల పులిహోరతో స్వామి వారికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 5గంటలకు శ్రీనివాస కల్యాణం, భక్తులందరికీ మహాప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు బళ్లాని వెంకట సత్యనారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, భజన మండలి అధ్యక్షులు తెలుగు నాగలక్ష్మమ్మ, జ్యోత్స్న, సాలమ్మ, అంజనమ్మ, వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పరీక్షా కిట్ల మంజూరు



గ్రామాలకు మంజూరైన తాగునీటి పరీక్షా కిట్లు

జూపాడుబంగ్లా: మండలంలోని 11 గ్రామసచివాలయాలకు 11 తాగునీటి పరీక్షా కిట్లు మంజూరైనట్లు ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు మాసాల క్రితం మండలానికి 11 తాగునీటి పరీక్షా కిట్లు మంజూరు కాగా వాటిని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు అందజేశామన్నారు. ప్రస్తుతం నూతన కిట్లు వచ్చాయని వాటిని కూడా పంపిణీ చేశామని చెప్పారు. ఈ కిట్లను వినియోగించి నిత్యం తాగునీటి పథకాల వద్ద నీటి పరీక్షలు నిర్వహించి ఫలితాలను ఎంపీడీఓ కార్యాలయంలో తెలియజేయాలని ఆదేశించారు. గ్రామాల్లో అక్కడక్కడ తాగునీరు కలుషితం వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో తప్పనిసరిగా నీటిపరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే పక్షం రోజులకోపర్యాయం తప్పనిసరిగా తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలని సూచించారు. శుభ్రం చేసిన తేదీని ట్యాంకులపై తప్పనిసరిగా నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎక్కడైన తాగునీటి పైపులు లీకేజై నీరు కలుషితం అవుతున్నట్లయితే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

దామగట్లలో పోలీసు కవాతు



దామగట్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో శనివారం రూరల్ సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎలాంటి అల్లర్లు, గొడవలు సృష్టించకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున రౌడీ షీటర్లపై నిఘా ఉంచామన్నారు. ఎన్నికల్లో గెలిచిన వారు విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్చడానికి అనుమతి లేదని తెలిపారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మిడుతూరు ఎస్ఐ జగన్‌మోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గాజుల దుకాణంలో మహిళలు



ఉరుసు సందర్భంగా పట్టణంలో జనసందోహం

ఊరంతా ఉరుసు సందడి



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న తిరుపంరెడ్డి

వెలుగోడు: పట్టణంలో హజరత్ సయ్యిదా రోఖియా బీబీ ఉరుసు మహోత్సవాలు అంగరంగ వైభవంగా, ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి రోఖియాబీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఫాతేహాలు సమర్పించారు. భక్తులు, బంధుమిత్రుల రాకతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. పట్టణంలో వెలసిన గాజులు, బొమ్మల దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. అధిక జనసందోహంతో ప్రధాన వీధులు కళకళలాడుతున్నాయి.

రసవత్తరంగా ఎద్దుల బండ లాగుడు పోటీలు

పట్టణంలో హజరత్ సయిదా రోఖియా బీబీ ఉరుసు సందర్భంగా ఆరు పండ్ల లోపు విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను శనివారం వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పోటీల్లో శ్రీ సత్యసాయి జిల్లా పుల్లెటి పల్లె గ్రామానికి చెందిన బచ్చుల భాస్కర్ రావు వృషభాలు మొదటి స్థానంలో నిలువగా దాతల సహకారంతో రూ.40 వేల నగదు బహుమతిని అందజేశారు. ఏ. కోడూరుకు చెందిన చాగంటి నాగేశ్వరరావు ఎద్దులు రెండో స్థానంలో రూ.30 వేలు, మూడో స్థానంలో తాండ్రపాడుకు చెందిన చిన్న రత్నం, మల్యాల ఎస్ఎస్‌వీ ట్రేడర్స్ వృషభాలు రూ.20 వేల నగదు గెలుచుకున్నాయి. నాలుగో స్థానంలో పెద్ద కొట్టాలకు చెందిన భారతి ఎద్దులు నిలిచి రూ.15 వేల నగదును అందుకున్నాయి. ఐదో స్థానంలో నిలిచిన మఖ్తల్ మండలం జక్కిలేరు గ్రామానికి చెందిన అమర్‌సాహెబ్ ఎద్దులకు రూ.10 వేలు, ఆరో స్థానంలో నంద్యాలకు చెందిన బొల్లి శేషయ్య ఎద్దులకు రూ.5 వేలు, ఏడో స్థానంలో కే. బొల్లవరం గ్రామానికి చెందిన బోయిన రవితేజ వృషభాలకు రూ.3 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు యూనుసు, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, మండల కార్యదర్శి కే. రామ్మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, నాయకులు నసిరుల్లాఖాన్, షంషీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి



శివాజీ కాంస్య విగ్రహం ముందు సీఎం మోహన్ యాదవ్ దంపతులు

శ్రీశైలం: శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ దంపతులు శనివారం సందర్శించారు. శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దర్శనానంతరం శివాజీ మెమోరియల్ కాంప్లెక్స్ నిర్వాహకుల ఆహ్వానం మేరకు సీఎం దంపతులు హైదరాబాద్ వెళ్లడానికి ముందుగా శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. మరాఠా యోధుడి గురించి రాసిన విశేషాలు, చిత్రపటాలు తదితర వాటిని తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ రమేష్ నాయుడు, జిల్లా కో ఆర్డినేటర్ అభిరుచి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పైపులను పగలగొట్టిన దుండగులు



పైపులైను పనులు చేయిస్తున్న దృశ్యం

మహానంది: బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామంలోని సుంకులమ్మ ఆలయం సమీపంలో ఉన్న మంచినీటి పైపులైనుకు సంబంధించిన పైపులను దుండగులు పగలగొట్టిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ మన్నె జ్ఞానాభరణం, అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి సుబ్బారావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మోటార్, పైపులు ఎత్తుకెళ్లారని, వాటి స్థానంలో కొత్తవి తీసుకొచ్చి అమర్చామని చెప్పారు. ఈ ఘటనపై బండిఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి సుబ్బారావు తెలిపారు.

మత్స్యకారులకు ప్రత్యామ్నాయం చూపించాలి

కొత్తపల్లి: కృష్ణానదిలో చేపలవేట సాగించే మత్స్యకారులకు ప్రత్యామ్నాయం చూపించి ఖాళీ చేయించాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సుమారు 40 సంవత్సరాల క్రితం వైజాగ్ నుంచి వందల మంది మత్స్యకార కుటుంబాలు చేపలవేట చేసుకునేందుకు ఇక్కడికి వచ్చారన్నారు. వారు సంగమేశ్వరం సమీపంలోని సీమల తిప్ప వద్ద స్థావరాలు ఏర్పాటు చేసుకొని కృష్ణానదిలో చేపలవేట చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి ఇక్కడే ఓటు హక్కుకూడా ఉందని చెప్పారు. అటువంటి వారిపై ఇటీవల ఆత్మకూరు ఫారెస్టు అధికారులు జులూం చూపిస్తూ ఆ ప్రాంతంలో చేపలవేట చేయకూడదని, రాత్రివేళలో వన్యప్రాణులు సంచరిస్తాయని ఎప్పుడు లేనివిధంగా నిబంధనలు పెట్టి వారి జీవితాలను అగమ్యగోచరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఎటువంటి జీవనోపాధి చూపించకుండా వారి ఇంజిన్‌బోట్లను తీసుకెళ్లడం భావ్యం కాదన్నారు. వారికి ప్రత్యామ్నయ మార్గం చూపించి అక్కడి నుంచి ఖాళీ చేయించాలని కోరారు.

ప్రశాంతంగా డిప్యూటీ ఈఓ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి వస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పోస్టుల నియామక పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు డీఆర్‌ఓ పద్మజ తెలిపారు. పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల, రామకృష్ణ పీజీ కళాశాల, ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11.30గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఉదయం 7.30 గంటల నుంచి 8.15 గంటల్లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో 605 మంది అభ్యర్థులకు గాను 338 మంది పరీక్షకు హాజరయ్యారు. 56 శాతం హాజరైనట్లు డీఆర్‌ఓ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు తాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంపు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కల్పించారు. జిల్లాలోని మూడు పరీక్ష కేంద్రాలను జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు పరిశీలించారు.

ప్రశాంతంగా పదో తరగతి హిందీ పరీక్ష

నందికొట్కూరు: పదో తరగతి సప్లిమెంటరీ హిందీ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ ఫైజున్నీసాబేగం తెలిపారు. పట్టణంలో పదో తరగతి సప్లిమెంటరీ హిందీ పరీక్ష నిర్వహణ కోసం రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండోవ రోజు పరీక్షకు 171 మంది విద్యార్థులకు గాను 78 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రంలో శనివారం వీకెండ్ సందర్భంగా భక్తులసందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో రద్దీ కనిపించింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ఉదయం, సాయంత్రం అష్టవిధ మహామంగళ హారతులు, రుద్రాభిషేకం, అర్చన పూజలు నిర్వహించారు. భక్తులు స్థానిక కాశినాయన అన్నపూర్ణ ఆశ్రమంలో అన్నప్రసాదాలు స్వీకరించారు.

ట్రేడ్ లైసెన్స్ రుసుము సకాలంలో చెల్లించాలి

నంద్యాల(సిటీ): పట్టణ పరిధిలో ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులందరూ తమ ట్రేడ్ లైసెన్స్ రుసుములు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సూచించారు. మున్సిపల్ పరిధిలోని స్కూల్స్, కళాశాలలు, ఆసుపత్రులు, బార్ – రెస్టారెంట్‌లు, హోటళ్లు, దుకాణాలు ప్రతి సంవత్సరం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఓసీ), శానిటేషన్ ధ్రువపత్రాలు పొందాలని పేర్కొన్నారు. ట్రేడ్ లైసెన్స్ పొందిన వారు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన



ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్షావలి

నందికొట్కూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్షావలి తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో ప్రతి రోజూ స్టడీ అవర్స్, తరగతి గదిలో డిజిటల్ విద్యా బోధన, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, పాఠ్యపుస్తకాల సౌకర్యం, అమ్మ ఒడి సదుపాయం, విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతినెలా అసైన్‌మెంట్, యూనిట్ టెస్టు పరీక్షల నిర్వహణ, మినరల్ వాటర్ సదుపాయం(ఆర్‌ఓ ప్లాంటు), విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక పరిశుభ్రమైన వాష్ రూమ్స్(టాయిలెట్స్), సైన్స్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో ప్రయోగశాలలు, ఈఏపీసీఈటీ (ఈఎంసీఈటీ), ఎన్‌ఈఈటీ, జేఈఈ అభ్యసనకు సహకారం, విశాలమైన క్రీడా మైదానం క్రీడల పోటీలు, గ్రంథాలయం సౌకర్యం ఉన్నాయన్నారు. విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు.

కనుల పండువగా వైకుంఠనాథుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి మూలవిగ్రహాలు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవిలతో వైకుంఠనాథుని కల్యాణం కనుల పండువగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేష పూజలు నిర్వహించి పన్నీటి స్నానం చేయించారు. పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా తీర్చిదిద్దారు. ముస్తాబైన స్వామి, అమ్మవార్ల విగ్రహాలను వేద మంత్రాలు పఠిస్తూ పెళ్లిపీటలపైకి చేర్చారు. అనంతరం అర్చకులు పెళ్లిమంత్రాలు పఠిస్తుండగా భక్తులు కళ్యాణ క్రతువును జరిపించారు. మాంగల్యం తంతునామేనా అంటూ వేదమంత్రాలను పఠిస్తుండగా పండితులు స్వామివారి తరుపున శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల మెడల్లో మాంగల్యధారణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు.